కథానిక

# గాలి పడగలు

కొండేపూడి సూర్యకామరాజు

చిన్న చిన్న సంఘటనలు ఒక్కొక్కప్పుడు మన మనస్సుమీద అతి చురుకుగా పనిచేస్తై. అటువంటి సంఘటనతే పరమేశ్వరిని నా కొక ఆప్తురాలిగా చేసి నా మనసులో ఒకవిధమైన అనురాగం అంకురించేటట్లు చేసినై. లేకపోతే ఎక్కడనేను, ఎక్కడ పరమేశ్వరి!—ఏమిటీ బాంధవ్యం?

అంతసేపూ తమాషాగా ఎగురుతున్న గాలి పటం గింగురాలుకొట్టి మా యింటిపక్క ఆడవాళ్ల హాస్టల్లో పడిపోయింది. రింగు ఆడుకొంటున్న వాళ్ళల్లో పల్చగావున్న అమ్మాయి పరుగెత్తుకు వచ్చి పటం తెంపుకుపారిపోయింది. నేను డాబా దిగి హాస్టలుకి పరుగెత్తాను. వాళ్ళు మామూలుగా రింగు ఆడుకొంటున్నారు. గాలిపటం మాత్రం సెట్టుకు కట్టబడివుంది. వాళ్ళను చూడగానే అదో మాదిరిగా అయి మాట్లాడకుండా అక్కడే నిలబడిపోయా.

'ఎవరికోసమండీ?' గాలిపటం తెంపిన అమ్మాయి అడిగింది, సెట్టు అవతలనించి వచ్చిన రింగు పట్టుకొని.

'గాలిపటంకోసం'

'గాలిపటం మీ కెందుకివ్వాలో నాకర్థం కావటం లేదు.'

'మీ రన్నది నా కర్థం కాలేదు.'

'మీకూ గాలిపటం ..ఎందుకివ్వాలీ...అని అడుగుతున్నా—అర్థమయిందా యిప్పుడు ?'

నాకు తెలిసిపోయింది. వాళ్లు నన్ను ఏడిపించాలని చూస్తున్నారు. అటువంటప్పుడు మనం ఏ మాత్రం లోకువగా కనపడ్డా కళ్ళమ్మట నీళ్లు తెప్పించందే వదలరు. అందువల్ల కఠినంగా అన్నా—

'మీ ప్రశ్న అర్థమయిందికాని, మీ ప్రవర్తన మాత్రం అర్థంకావటంలేదు.'

'ఎల్లా అవుతుంది ?—ఇదేం ద్రాక్షపండను కున్నారేమిటి, గుటుక్కున మింగడానికి.'

నిజంగా ఆమె అట్లా అన్నందుకు కోపం రాలేదుకాని అక్కడవున్న పదిమంది అమ్మాయిలు గొల్లున నవ్వటం, వరండాలో పిట్ట గోడ పట్టుకుని నుంచున్న మరి కొంతమంది చప్పట్లు చరచటం నా కళ్లకు నీళ్లు రప్పించినై. ఆ నీటిని బిందురూపం చెందకుండా అతికష్టంమీద ఆపుచేసి కొంచెం పౌరుషంలో అన్నా-

'ఆ పటం నాది. దానికోసం పావలా మైదా పిండీ, బేడా అర్థణా రంగుకాగితాలు ఖర్చు అవటమే కాకుండా దాన్ని తయారు చెయ్యటానికి మూడుగంటలు పట్టింది. ఇస్తే సంతోషిస్తాను. లేకపోతే—"

నా మాట పూర్తికాకుండానే ఆ అమ్మాయి అందుకొని—

'ఆఁ లేకపోతే?' అన్నది.

ఆమె ప్రశ్నలోని విశేషం నా కర్థమైంది.

'లేకపోతే ఏంచేస్తాను?—ఏమీ చెయ్యను-వెళ్లిపోతానూ' అన్నాను.

'పోనీ యిచ్చెయ్యవే పరమేశ్వరీ, ఆయన్ను చూస్తే జాలేస్తుంది.' వాళ్లల్లో కొంచెంబొద్దుగా వున్న అమ్మాయి అంది.

'మరే పాపం. నీకెవర్నిచూసినా జాలే- మన కాంపౌండులో పడింది, నాకు దొరికింది. నేనెందు కివ్వాలీ ?'

ఇంక అక్కడ వుండలేక కోపంతో గిరుక్కున తిరిగి వచ్చేస్తున్నా.

'ఇందండి,తీసుకోండి' అంటూ బొద్దుగావున్న అమ్మాయి పటంతీసుకువచ్చి యివ్వబోయింది.

'నాకఖ్ఖర్లేదు.'

'అల్లా కోపంతెచ్చుకుంటే ఎల్లాగండీ. పరమేశ్వరి తమాషాకి ఏదో అంటుంది. అసలా మనిషి తీరేఅంత. అవన్నీ పట్టించుకుంటే ఎల్లా

చెప్పండి—తీసుకోండి' అని ప్రాధేయపూర్వకంగా అంది.

'కుసుమనాథం, ఆయన అంతమాత్రానికి వింటాడా? ఆయన కోపాన్ని జోకొట్టిపోగొట్టి నోటిదగ్గర చాక్‌లెట్ పెడితే అది చప్పరిస్తూ అయితే యివ్వండీ అని అడిగితీసుకొని చల్లగా జారుకుంటాడు. నామాట విని నువ్వాపనిచెయ్.' దూరంనించి గట్టిగా అన్నది పరమేశ్వరి.

'అదుగో విన్నారా ఎట్లా అంటున్నారో' కుసుమనాథంతో అన్నాను.

'ఆమెజోలి మీకెందుకండీ?- మీ పటం తీసుకు మీరువెళ్లండి.'

'మీరంతగా బ్రతిమాలుతున్నారు కాబట్టి తీసుకొంటున్నాను. ఆసంగతి చెప్పండి మీ స్నేహితురాలితో' అని పటం తీసుకుని వెనక్కి తిరిగి చూడకుండా వచ్చేశాను. నవ్వులూ, కేవ్వులూ, కరతాళధ్వనులూ మాత్రం నేను మేడ ఎక్కేదాకా వినిపిస్తూనే ఉన్నాయి.

* * *

ఈ సంఘటన వెంటనే నా మనస్సుమీద పనిచెయ్యలేదు కాని రోజులు గడిచినకొద్దీ దాని ప్రభావం చూపటం మొదలుపెట్టింది. పరమేశ్వరీ, కుసుమనాథం పిట్టగోడదగ్గర నుంచుని పొద్దున్నే ముఖంకడుక్కునేవారు. నేనూ, వాళ్లకెదురుగా, మాయింట్లో కూర్చుని ముఖం కడుక్కునేవాడిని. వాళ్లు అప్పుడప్పుడు హాస్టలుముందువున్న జీడిమామిడిచెట్టుకింద కూర్చుని చదువుకునేవారు. నేను కూడా వాళ్లు నాకు కనపడేలాగ ముందు వసారాలో కూర్చుని గ్రూపు పుస్తకాలు చదువుకునేవాడిని. బస్సురాగానే వాళ్ళు కాలేజీకి వెళ్లిపోయేవారు. నేనూ ఏ స్నేహితుడింటికో పోయేవాడిని. అవకాశం చిక్కినప్పుడల్లా పరమేశ్వరికేసే చూస్తూ కూర్చునేవాడిని. ఎప్పుడయినా ఆమె కనపడకపోతే మనస్సు పరితపించేది. ఆమె కనపడకపోతే ఆఖరుకి ఆమె ముఖ్యస్నేహితురాలైన కుసుమనాథాన్నైనా చూసి కొంతవరకూ తృప్తిపొందేవాడిని. అప్పుడప్పుడు అనుకొనేవాడిని, పరమేశ్వరిని గురించే అస్తమానం ఎందుకు ఆలోచిస్తానా అని. కారణం తెలిసేది కాదు. రోజులు గడిచినకొద్దీ ఆమెను చూడాలని నామనస్సు పొందేబాధ తల్చుకుంటే నాకాశ్చర్యం వేసేది. రోజూ సాయంత్రం మా యింటికి ఎదురుగా బీచిలో కూర్చునేవాడిని. పరమేశ్వరీ, కుసుమనాథం ఒకళ్ల భుజాలమీద ఒకళ్లు చేతులు వేసుకొని మెల్లగా నడిచి వచ్చేవారు. కాసేపు అటూ యిటూ తిరిగి నాకు అయిదారుగజాల దూరంలో కూర్చునేవారు. నవ్వుకుంటూ యేవో కబుర్లు చెప్పుకునేవారు. వాళ్ళమాటలు నాకు వినబడేవి కావు. కాని అప్పుడప్పుడు నాకేసి చూస్తూ వుండడంవల్ల వాళ్ళ సంభాషణ నన్ను గురించేనేమో అనుకునేవాడిని. నేను వుత్త ఫూల్‌ని అనుకొంటూన్నారేమో అని భయంవేసేది. అట్లా అనుకోరనీ, నన్ను గురించి మంచి అభిప్రాయమే వాళ్ళకు వుంటుందనీ మనస్సుని సమాధానపరచుకునే వాడిని. ఇంతలో కాలేజీ స్టూడెంట్స్ గుంపులు గుంపులుగా వచ్చేవారు. స్నేహితురాండ్రిద్దరూ లేచి వెళ్లిపోయేవారు. ఇంచుమించు రోజూ యీ విధంగానే జరిగేది.

ఒక రోజు సాయంత్రం ఆరు గంటల నలభై మూడు నిమిషాలకి హఠాత్తుగా పరమేశ్వరితో మాట్లాడాలని బుద్ధి పుట్టింది. కాని ఆకోర్కె నెరవేరేదెట్లా? దీర్ఘంగా ఆలోచించా. ఒక చక్కటి గది ముందు వసారాలో కూర్చొని చదువుకొంటోంది. కుసుమనాథం ప్రక్కనున్న బల్లమీద కూర్చుని వుంది. వాళ్లు నారాక గమనించలేదు. వాళ్ళ దృష్టిని ఆకర్షించటానికి చెప్పులు చప్పుడు చేసుకొంటూ దగ్గరకు వెళ్ళాను.

'ఏమండోయ్, ఇల్లా వచ్చారు.—కొంపతీసి మీ గాలిపటం యీ సారి మా గదిలో పడలేదు కదా?' అన్నది పరమేశ్వరి చేతిలో పుస్తకం మూసి.

'గాలిపటం కాదండీ. అర్జంటుగా డాక్టరుని పిలవాలి. మీ ఫోను వుపయోగించటానికి అవకాశమిస్తే సంతోషిస్తాను.'

'—లేకపోతే?'

ఆమె అట్లాగనగానే నాకు పూర్వపు సంభాషణ జ్ఞాపకం వచ్చింది.

'మళ్ళీ మీరు కోపం తెచ్చుకొని వెళ్ళవలసి వుంటుంది. తనతో ఎందుకు మాట్లాడుతారు?—మేడమీదకుపోయి వార్డెన్ని అడగండి' కుసుమనాథం అన్నది.

ఈమాత్రందానికి వా[illegible]

దయచేసి మీరు అనుమతిస్తే సంతోషి... కాదు...కృతజ్ఞుడిని.' చివరిమాటని తడబడుతూ మార్చి అన్నాను.

'అనుమతించాను. ఫోను ఆ చివరగదిలో వుంది వెళ్ళండి' పరమేశ్వరి అన్నది.

ఆమె అనుమతి యివ్వకపోతేనే బాగుండును. నిజంగా నాకు కావలసినది ఆమెతో సంభాషణ కాని ఫోనుకాదుగా!—సంభాషణ పొడిగించ డానికి దార్లు వెతికా.

'డాక్టరు వెంకయ్యగారి ఫోను నెంబరు మీకు తెలుసా?'

'వెంకయ్యగారి ఫోనునెంబరు ఏమోకాని పిచ్చాసుపత్రి ఫోను నెంబరు నాకు తెలుసు—చెప్పమంటారా?' పరమేశ్వరి నవ్వుతూ అన్నది.

ఆమె ఆ విధంగా ఎగతాళిగా మాట్లాడినా కోపం రావటానికి బదులు సరదాగానేవుంది. ఆమె జోక్ మెచ్చుకున్నట్టుగా నేనూ నవ్వాను.

'టెలిఫోన్ దగ్గర డైరెక్టరీవుంది, రిఫర్ చెయ్యండి' అన్నది కుసుమనాథం.

ఇక గత్యంతరం లేక టెలిఫోన్‌గదివద్దకు వెళ్ళాను. గదిలో లైటులేదు. లోపలికివెళ్ళి స్విచ్ కోసం గోడమీద తడివాను. వెంటనే షాక్ కొట్టినట్టయింది. అప్రయత్నంగా చిన్న కేక పెట్టాను. వాళ్ళిద్దరూ పరుగెత్తుకొని వచ్చారు. కుసుమనాథం స్విచ్ వేసింది. పరమేశ్వరి కంగా రుగా—

'ఏమైంది?' అని అడిగింది.

'షాక్......'

'షాక్ కాదు తేలుకుట్టించుకున్నారు—ఏదీ మీ చెయ్యి యిల్లా యివ్వండి.'

ఒక్క చూపుడు వేలుతప్ప తక్కిన వేళ్లు మూసి, నా కుడిచెయ్యి ఆమెకు అందించాను. నా దృష్టిమాత్రం గోడమీద ఎర్రతేలుమీదే వుంది.

'ఎక్కడకుట్టిందో సరిగ్గాచెప్పండి' నావేల్ని పరీక్షచేస్తూ పరమేశ్వరి అడిగింది.

వేలుచివర చిన్న బిందువు చూపా. వెంటనే ఆమె నా వేల్ని మొదటినుంచి చివరదాకా పిండి, నోట్లో పెట్టుకొని కరచి, రక్తాన్ని తమా షాగా లోపలికి పీల్చి వుమ్మేసింది. ఆమె కరచి

[illegible]

పోయాను. కుసుమనాథం యీలోగా చిన్న గుడ్డ పీలిక తెచ్చింది. ఇద్దరూ కలిసి నా వేలుకి కట్టు కట్టారు.

మీరు వెంటనే యింటికి వెళ్లి పొటాసియం పెర్మాంగనేట్ వుంటే కొంచెం అంటించండి. లేకపోతే నీరుల్లిపాయ అరగతీసి రాయండి—ఊఁ, త్వరగా' అన్నది.

నిజంగా ఆమె పడే కంగారుచూసి నాకు ఆశ్చర్యం వేసింది. మామూలుగా వుండే ఆమె కొంటెతనమంతా ఎక్కడ మాయమైందో! తేలుకాటు సంగతి నా మనస్సులో అంతగా లేనేలేదు. పరమేశ్వరి మనస్తత్వం అర్థం చేసు కోవటం కోసమేనా మనస్సు పనిచెయ్యటం మొదలుపెట్టింది. అందువల్ల తేలుబాధ నాకు తెలియటమే లేదు.

'త్వరగా వెళ్ళండి; వెళ్ళి నేను చెప్పిన చికిత్స చెయ్యండి - లేకపోతే తెల్లవార్లూ బాధపడ వలసివుంటుంది.' పరమేశ్వరి మళ్లీ నన్ను హెచ్చ రించింది.

వసారామెట్లు మెల్లగా దిగి యింటికి వచ్చే శాను.

ఆ రాత్రి నాకు నిద్ర పట్టలేదు. కారణం తేలు మాత్రంకాదు, బహుశా పరమేశ్వరి ప్రథమ చికిత్సవల్లనే అనుకొంటూ, తేలువిషం ఎక్కనే లేదు. ఎటొచ్చీ ఆమె కరచినందువల్ల అయిన గాయం మాత్రం అప్పుడప్పుడు చురుక్ చురుక్ మనేది. అదయినా అదోమాదిరి చక్కలిగింత పెట్టినట్టుండేకాని బాధపెట్టలేదు.

ఆరోజున వాళ్లకు పరీక్షలు మొదలు. పది రోజుల్లో అయిపోతాయి. పరీక్ష లవగానే పర మేశ్వరి వూరికి వెళ్లిపోతుంది. ఈ విషయం నా మనస్సులో బెంగనీ, ఆరాటాన్నీ పెంచటం మొదలుపెట్టింది.ఆమెవున్న న్నాళ్లయినా మాట్లా డాలని అనిపించేది. హాస్టలుకి వెళదామనుకొనే వాడిని- ఉదయం తొమ్మిదిగంటలకు ఆమె కాలేజీకి వెళ్ళిపోయేది. మళ్ళీ మధ్యాహ్నం రెండింటికి తిరిగివచ్చేది. వచ్చీరావటంతోనే పుస్తకం ముందుపెట్టుకుని జీడిమామిడి చెట్టుకింద కూర్చునేది. పూర్వంలాగ తరుచు నాకేసి చూడ టమైనా లేదు. రాత్రి రెండు గంటలవరకూ

ఆమగదిలో లైటు వెలుగుతుండేది.' దాన్నిబట్టి ఆమె చాలా పట్టుదలతో చదువుతోందని గ్రహించాను. ఆమె ఒక్కనిమిషం కూడా వృదా చేసినట్టు కనపడలేదు. అటువంటప్పుడు నేను వెళ్ళి ఆమెతో మాట్లాడుతూ కూర్చుంటే ఏం బాగుంటుందీ? ఆమెచదువుకి అంతరాయం కాదూ? అంతరాయం అటుంచి అనవసరంగా వెళ్ళి ఏం మాట్లాడుతాను?- అసలు మాకు మాట్లాడవలసిన విషయాలేమున్నై? అవసర మేముంది?

ఈ సందేహాలూ, ప్రశ్నలూ నామనస్సుని చాలా బాధపెట్టినై. ఏమీతోచక వూరుకున్నా- మూడురోజులదాకా.

నాలుగోరోజున వూరుకోవడం అసాధ్యమన్న సంగతి నిర్ధారణగా తేలిపోయింది. ఆలోచించి ఆలోచించి సైకిలు వేసుకొని నా స్నేహితుడి యింటికి వెళ్ళాను.

'ఏమిటి యీమధ్య దర్శనంలేదే' అన్నాడు స్నేహితుడు.

'దర్శనాని కేం భాగ్యం. ఇంకొక వారం పోయాక రోజుకి మూడుసార్లు వస్తా—అర్జంటుగా ఫోన్ చెయ్యాలి' అన్నాను, ముఖానికి పట్టినచెమట రుమాలుతో తుడుచుకుంటూ.

'ఏదోవుంది విశేషం. కానియ్' అన్నాడు.

'ఎవరు కావాలండీ' సన్నటి ధ్వని. అది పరమేశ్వరిది మాత్రం కాదు.

'పరమేశ్వరిగారిని ఒకసారి పిలుస్తారూ?' తర్వాత కొద్దికాలం విరామం. ఆ కాలపరిమితి చాలా స్వల్పమయినా నాకుమాత్రం దీర్ఘంగానే తోచింది.

'ఆఁ, ఎవరు మాట్లాడేదీ?'

'నేనే.'

'నేనే అంటె నాకేంతెలుస్తుంది?- అల్లాకంగారు పడతారేం?'

'నేనండీ...ఆవేళ తేలుకుడితే...'

'ఓహో మీరా—గాలిపడగలవారా?'

'అవును. క్షమించండి, మీకుశ్రమకల్గిస్తున్నా.'

'అబ్బే, శ్రమ ఏమంది?'

'లేకపోవటమేమిటి—నేను పిలిచేటప్పటికి మీరు జీడిమామిడి చెట్టుక్రింద చదువుకోటంలేదూ?'

'సరిగ్గా చెప్పారే—మీ కెల్లా తెలిసిందీ?'

'నాపీ...ఎక్స్‌రే కళ్ళలెండి — మీ. రే ం చేసినా నాకు కనపడుతూనే వుంటుంది.'

'అయితే యిక్కడ యింకా ఎవరున్నారు చెప్పండీ, చూద్దాం.'

'ఇంకెవరు-కుసుమనాథంగారు వున్నారు.'

'అరె. సరిగ్గా చెప్పారే!'

'ఏమిటనుకున్నారు—మీరు ఎర్రటి బ్లవుజ్ తొడుక్కున్నారు...చీర ఆకుపచ్చటిది.'

'అదీ. పప్పులో కాలేశారు. పొద్దుటినుంచీ చూసి ఆ బట్టలే యింకా వున్నాయనుకున్నారు: అవి మార్చేశాను. ఇప్పుడు అన్నీ తెల్లబట్టలే— అవును కాని మీ యింట్లో ఫోన్ లేదుకదా ఎక్కడనుంచి మాట్లాడుతున్నారు?'

'మా ఫ్రెండ్ యింట్లోనుంచండీ-'

'ఆయన మీ ప్రక్కనవున్నాడా?'

'అబ్బే లేదు. ఎవరోవస్తే బయట మాట్లాడుతున్నాడు.'

'అన్నట్లు మీవేలుమీద గాయం మానిందా- ఆవేళ గట్టిగా కరిచాను సుమండీ'

'నావేలుకేం; బాగానేవుంది కాని ఆ వేళ మీకు చాలా శ్రమ యిచ్చినందుకు సిగ్గు పడుతున్నాను.'

'శ్రమేమిటండీ. చెయ్యవలసిన విధి. నాకు తేలుకుడితే మీరుమాత్రం అల్లా చెయ్యరూ?'

'నేను చేసివుందునో లేదో చెప్పలేనుగాని, ఏవో చిన్నచిన్న కారణాలవల్ల మీరు చెప్పిన ఆ విధిని నిర్వర్తించటానికి చాలామంది జంకుతారు.'

'చదువుకున్నవాళ్లు జంకుతారంటే నేను నమ్మను.'

'చదువుకున్నవాళ్ల సంగతే నేచెప్పేది. ఎవరో అక్కడక్కడ మీబోటివారు తప్ప చాలామంది అనవసరమైన అనుమానాల్ని, భయాల్ని కల్పించుకొని తటస్థంగా వూరుకుంటారు. అందులో స్త్రీ పురుష ప్రసక్తివుంటే యింక చెప్పనక్కర్లేదు.'

'కేవలం స్త్రీ పురుషభేదాన్ని బట్టి మన వుద్దేశ్యాలూ, చర్యలూ మారుతూవుంటే, యింక అడగక్కరలేదు.'

నాకు ఆమెవల్ల తెలుసుకోవలసిన విషయాలు అనేకం వున్నట్టు అనిపించింది. కాని ఆమె పరీక్షలకు చదువుతుంటే వాటినీ, వీటినీగురించి ఆమెను అడుగుతూవుంటే అసందర్భంగానూ, అప్రస్తుతంగానూ వుంటుందని వూరుకున్నాను.

'నాకొక్క కోర్కెవుంది. — తీరుస్తారా?' అడిగాను.

'తప్పకుండా... చేతనై తే.'

'నన్ను మీ స్నేహితుడిగా అంగీకరిస్తారా?'

'తప్పకుండా. అయినా యిప్పుడుమాత్రం మీగు స్నేహితులుకారా ఏమిటి?' నవ్వుకూడా వినపడింది. కాస్త నిశ్శబ్దం. మళ్లీ అడిగింది: 'మీ పేరేమిటండీ'

'కామేశ్వరరావు'.

'కాదు. అబద్ధమాడుతున్నారు.'

'నేను అబద్ధం ఆడుతోన్నట్టు మీకెట్లా తెలుసు?'

'ఎల్లాగో తెలుసు, మీ పేరు కామేశ్వరరావు కాదు.'

'మరేమిటి చెప్పండి'

ఆమె నా పేరు చెప్పింది. ఇప్పటివరకూ నా పేరు ఆమెకు తెలియటానికి అవకాశం కలిగినట్టు నాకు తెలీదు. ఆశ్చర్యంతో అడిగాను—

'మీకెట్లా తెలిసిందండీ, నా పేరు?'

అదేమంత ఆశ్చర్యకరమైన విషయం?— నా పేరు తెలీలా మీకు?'

'గాలి పటానికి వచ్చినప్పుడు మీరు, కుసుమనాథంగారు మాట్లాడుకోవటంలో తెలిసింది'

'మీ పేరు పోష్టుమన్ వల్ల తెలిసింది'

'అబ్బో మీరు చాలా గట్టివారే!'

'మీకంటేనా?' అంది. మళ్ళీ నవ్వు.

'మీ విలువైన కాలాన్ని వృధాచేస్తున్నాను'

'ఫరవాలేదండీ—ఇంతకీ మీరేం చేస్తున్నారు'

'భోం చేస్తున్నాను—అయినా ఊహించండి చూద్దాం!'

'ఎమ్. ఎస్. ఎమ్. కాదూ?' నవ్వటం మొదలు పెట్టింది.

'మీకేం నవ్వుగానే వుంటుంది.—ఇంటర్మీడియట్ లోనే నాచదువుకి అనేక అడ్డంకు లేర్పడినై'.

'అయితే మొన్న మీకు పరీక్షలయినట్టున్నాయి—ఎల్లా రాశారు?'

'డబ్బు కట్టానుకాని పరిస్థితులు పరీక్షకు హాజరుకాకుండా చేశాయి—మళ్ళీ సెప్టెంబరుకే —అదయినా అనుకూలిస్తే-ఇంతకీ ఉత్సాహం లేదండీ. నీ మొహం నీకు చదువెందుకు అని ప్రతివాళ్లూ నిరుత్సాహపరచటమే. ఏం చెయ్యమంటారు చెప్పండి?'

'ఒకళ్ళమాటలు మీ రెందుకు లెక్క చెయ్యటం? పట్టుదలతో చదవండి—ఎందుకు ప్యాసవరో చూస్తాను. వ్యతిరేక పరిస్థితుల్ని ధైర్యంతో ఎదుర్కొని ముందుకు సాగితేనే గొప్పతనం. అన్నీ బాగుంటే మీ గొప్పా నాగొప్పా ఏముందీ?—అదీ కాక నూటికి తొంభైమంది మీకంటె ఎక్కువ క్లిష్టపరిస్థితుల్లో వుంటారు. వాళ్ల సంగతేమిటి?'

'అవుననుకోండి...'

'—అందుకని, కష్టపడి పట్టుదలతో చదవండి. పరీక్ష ప్యాసయేదాకా గాలి పటాలు ఎగరెయ్యకండి' ఆమె నవ్వింది-

'చెప్పండి. అల్లా చేస్తారా?'

'అట్లాగే'

'ఊరికే అట్లాగే అంటే కాదు. క్రియలో కనపరచాలి'

'లేదు—మీరు చెప్పినట్టు తప్పకుండా చేస్తాను. మీ సలహాకి కృతజ్ఞుడిని. అన్నట్టు మీ ఎడ్రస్ చెప్పారుకాదు'

ఆమె ఎడ్రస్ చెప్పింది. మా సంభాషణ మొదలుపెట్టి చాలా సేపైంది. కాని యింకా మాట్లాడాలనేవుంది.

'ఈవాళ మీ టిఫెనేమిటండీ' అన్నాను.

'మైసూర్ పాక్'

'నాకు నోరూరుతున్నదండీ'

'మీ టిఫెనేమిటి, ఈవాళ?'

'నాకు రెగ్యులర్ గా టిఫెనంటూ వుండదు. సమయానికి జేబులో డబ్బులువుంటే ఏహోటల్ కయినా పోతాను- అంతే.'

'మీ పూర్తికథంతా వినాలని వుందండీ. అప్పుడప్పుడు రాస్తూంటారుగా.'

'త[illegible]మీరు జవాబు వ్రాస్తాంటారా లేకపోతే మీవూరు వెళ్ళగానే మర్చిపోతారా ?'

'మీకాసందేహం అక్కర్లేదు- తప్పకుండా రాస్తూంటాను.'

'థాంక్స్- మీరు వూరుకెప్పుడువెళ్తారు ?'

'ఎల్లుండి సాయంత్రం పాసెంజరుకే వెళతా- వీలుంటే స్టేషనుకి రండి.'

'తప్పకుండా వస్తా.'

'ఇంక పోయి చదువుకుంటూ- నమస్తే.'

'నమస్తే' అన్నాను. ఆమె వినిపించుకుందో లేదో తెలీదు.

* * *

ఇద్దర్నీ రైలెక్కించాను. బండి కదలటానికి యింకా పావుగంట వ్యవధి వుంది. పరమేశ్వరి రైలుపెట్టె గుమ్మందగ్గర నిలబడ్డది. నేను గుమ్మానికి వున్న హేండిల్ పట్టుకుని ప్లాట్‌ఫారమ్‌మీద నిలబడ్డా. కుసుమనాథం కిటికీదగ్గర కూర్చుని తల బయటకుపెట్టి మాకేసి చూస్తోంది. తల్లి తననివిడిచి వూరికివెడుతోంటే, ఏడెనిమిది సంవత్సరాల వయస్సు కల కుర్రవాడికి ఎట్లా వుంటుందో అట్లావుంది నాకని. బిక్కమొహం వేసుకుని మాట్లాడకుండా నుంచున్నా. నిమిషాలు గడచినకొద్దీ కళ్లు తడవటం ప్రారంభించినై. నా కన్నీరు ఆమె చూస్తుందేమో నని భయపడి ముఖం తుడుచుకున్నట్టు నటిస్తూ రుమాలుతో కళ్లు తుడుచుకున్నా. కాని నా ప్రయత్నం విఫలమైంది. ఆమె అడిగింది——

'ఏమండీ అల్లావున్నారేం ?'

'ఎట్లా వున్నాను ?- బాగానే వున్నానే' అన్నాను, తెచ్చిపెట్టుకున్న నవ్వుతో.

'ఇటువంటి చిన్నవిషయాల్లోనే యింతబెంగ పెట్టుకుంటే ముందుముందు మీకు జీవించటమే కష్టమౌతుంది. ఇంతకీ ఏంకొంపమునిగింది, మీరు ఏడవటానికి ?'

నా మనోభావాలు అంతవిపులంగా ఆమెకు తెలియటానికి కారణం నామనస్సుని నేను దాచలేకపోవటమో లేక ఆమె గ్రహింపు శక్తి ప్రభావమో నే నూహించలేకపోయాను.

'పాపం, ఆయన్నిచూస్తే జాలేస్తోంది' కుసుమనాథం అన్నది.

'నీకెవర్నిచూసినా జాలే. అంత జాలేస్తే మీ వూరు తీసుకుపోరాదూ ?' పరమేశ్వరి నవ్వింది. కుసుమనాథం కూడా నవ్వింది. నేనూ నవ్వకుండా వుండలేకపోయాను. ఇంతలో చక్రకేళీ అరటిపళ్లు వచ్చాయి. పరమేశ్వరి ఆరుపళ్లు తీసుకుంది. నేను జేబులోంచి అర్ధరూపాయి తీసి అతడికి యివ్వబోయాను.

'ఉంచండి - మేం వెళ్ళాక మీరు కాఫీ తాగొచ్చు' అని డబ్బిచ్చి అతడిని పంపించింది. ముగ్గురం పళ్ళుతిన్నాం, ఈల వినపడ్డది.

'టయిమైనట్టుంది-బాగా చదువుతారు కాదూ?' అని ఆమె అడుగుతూంటే మొట్టమొదటిసారిగా ఆమె ముఖంలో దైన్యత కనపడింది.

సమాధానంగా తల వూపాను. ఆమె ఏదో అన్నది. కాని ఇంజను కూతలో కలిసిపోయింది. బండి కదలడంతోనే 'నమస్తే' అన్నాను. ఆమె కూడా తన రెండు చేతుల్నీ కలిపింది. రైలు ముందుకుపోతుంటే నే వెనక్కు వెడుతూన్నట్టయింది. కళ్ళు తిరిగినై. రైలు వెళ్లిపోయింది.

* * *

నా పరిస్థితులూ, వాతావరణమూ మారకపోయినా నేనుమాత్రం మారాను. ఇదివరకులాగ జీవితమంటే కష్టంగా తోచటంలేదు. నాలో ఒక కొత్త ఉత్సాహం కలగటం మొదలుపెట్టింది. పట్టుదలతో చదువుతూన్నా. ఒక్కనిమిషంకూడా వూరికే కూర్చోటంలేదు. అంతగా ఎప్పుడైనా తీరుబడిగా కూర్చుంటే ఒక్కవిషయం ఆలోచిస్తుంటాను——'మానవుడు చేసిన ప్రతిపనిలో కొద్దో గొప్పో స్వార్థంవుండి తీరుతుంది' అంటారు, మనస్తత్వ శాస్త్రవేత్తలు. కాని పరమేశ్వరితో ఏర్పడిన నా స్నేహంలో ఏం స్వార్థం ముందో ఎంత ఆలోచించినా నాకర్థం కాలేదు.